ప్రజాజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 12 | జూన్ | 2024 | పేజీలు : 5



# వామ్మో... జూన్..!

**ప్రారంభమైన పాఠశాలలు**

**విద్యార్థుల తల్లిదండ్రుల్లో మొదలైన గుబులు...!**

**ప్రైవేట్ పైనే మక్కువ**

**అధిక ఫీజులతో అతలాకుతలం**

**నియంత్రణ లేని ఫీజులు**

**అరికట్టలేని ప్రభుత్వం**

**పుస్తకాలు, డ్రెస్సులు, షూస్‌లతో ఆర్థిక భారం**

బడులు తెరుచుకోనున్నాయి. ఈ వార్త విద్యార్థుల తల్లిదండ్రుల్లో గుబులు రేపుతుంది. జూన్ మాసం వస్తుందంటేనే తల్లిదండ్రులు ఆర్థిక భారం మోయలేక ఇబ్బందులు పడుతుంటారు. అప్పుడే విద్యార్థుల ఫీజులు కట్టే సమయం వచ్చిందా అంటూ ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల ఫీజులు, పుస్తకాలు, డ్రెస్సులు, షూస్. ఇతర సామాగ్రి కొనుగోలు విషయాల్లో ఆందోళన చెందుతుంటారు. ఇటీవలే వార్షిక పరీక్షల ఫీజుతో భారం మోయగా, ఇప్పుడు నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు.

*ఇల్లందు, జూన్ 11, ప్రజాజ్యోతి:*

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించకపోవడం, ఉపాధ్యాయుల కొరత తీర్చకపోవడం వంటి కారణాలతో పాటు కొందరు ఉపాధ్యాయులు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తుండడం కారణంగా ప్రభుత్వ పాఠశాలలంటే విద్యార్థుల తల్లిదండ్రుల్లో దురభిప్రాయం ఏర్పడింది. ఇక బాలికలకు ఎక్కువగా ప్రైవేట్ పాఠశాలల్లో సరైన సదుపాయాలు కల్పించరనే అపోహ కూడా ఉండడం కారణంగా బాలికలను ఎక్కువగా ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఆర్థికంగా ఉన్న వారితో పాటు మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, పేద వర్గాలు కూడా ప్రైవేటు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తే తమ పిల్లలు వృద్ధిలోకి వస్తారనే ఆశతో ఎంత కష్టమైనా భరించి వారిని ప్రైవేట్ లో చేర్పించడం జరుగుతుంది. ఇక్కడే ప్రైవేట్ పాఠశాలలు అన్ని అవకాశాలను

మిగతా 2 లో..



# పనిలో కాదు... బాల్యం... బడిలో...

2 లో

**బాల్యాన్ని బందీ చేయటం అనాగరిక చర్య**

**బాలకార్మిక వ్యవస్థలో మగ్గిపోతున్న బాల్యం**

**పిల్లల తాత్కాలిక సంపాదన, ప్రయోజనాలు తల్లిదండ్రులు ఆశించకూడదు**

**బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి స్థిరమైన దీర్ఘకాలిక కృషి అవసరం**

**నేడు బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం**



అశ్వారావుపేట, ప్రజాజ్యోతి




## ప్రభుత్వ సంక్షేమ పథకాలు...

# ప్రజలందరికీ చేరాలి

**అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి**

**విద్య, వైద్యం, తాగునీటి పై ప్రత్యేక దృష్టి సారించాలి**

**ప్రభుత్వ భూములు కబ్జా చేసే వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలి**

**రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష సమావేశం**

*భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జూన్ 11, ప్రజాజ్యోతి*

ప్రజలంటేనే ప్రభుత్వమని ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరవేసే విధంగా ప్రజాప్రతినిధులతో పాటు ప్రభుత్వ అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గం లోని ప్రజలు ఎవరు ఇబ్బంది పడకుండా చూడవలసిన బాధ్యత మన పైన ఉందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగిలేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల జిల్లా స్థాయి సమీక్ష సమావేశం మరియు పత్రికా సమావేశం లో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకొని ప్రజా పాలన సక్రమంగా పరిపాలించడానికి ఈ ప్రభుత్వం మీద నమ్మకంతో మమ్మల్ని ఎన్నుకోవడం జరిగిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లా అధికారులు నియోజకవర్గంలోని శాసనసభ్యులను సంప్రదించి నియోజకవర్గంలోని సమస్యలను తప్పనిసరిగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యంగా ఇందిరమ్మ ఇల్లు, త్రాగునీరు, విద్యా, వైద్యం, గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు, కల్వర్టులు మీద ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అలాగే అర్హులైన

మిగతా 2 లో..

# వామ్మో జూన్..!



(మొదటి పేజీ తరువాయి)

ఉపయోగించుకొని ప్రతి ఏటా ఫీజులను పెంచుతూపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రతి సంవత్సరం ప్రైవేట్ పాఠశాలల్లో ఏదో కొత్తదనమంటూ ఫీజులను పెంచేస్తున్నారు. పాఠశాలల మధ్య ఎంత పోటీ ఉన్నా ఫీజుల విషయంలో మాత్రం అందరూ కఠినంగానే వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులను అడ్డగోలుగా పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులపై మోయలేని భారం మోగుతున్నాయి. ప్రతి సంవత్సరం జూన్ మాసంలో తల్లిదండ్రుల ఖజానాను ఖాళీ చేస్తున్నాయి.

**నియంత్రణ లేని ఫీజులు... అరికట్టలేని ప్రభుత్వం...**

జూన్ మాసం రాకమునుపే ఆయా ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు, డొనేషన్ల దందా విచ్చలవిడిగా నడుస్తుంది. ముందస్తు ప్రచారం, అడ్మిషన్ల పేరిట తల్లిదండ్రుల వద్ద దోచుకో వద్దని ప్రభుత్వం చెబుతున్న ప్రైవేటు విద్యాసంస్థలు పెడచెవిన పెడుతున్నాయి. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని ఆయా పాఠశాలల్లో విద్యార్థుల ఎన్ రోల్ మెంట్ ను ప్రతి సంవత్సరం పెంచుకుంటూ పోతున్నాయి. ఇక ఆయా పాఠశాలలకు తోక పేర్లను తగిలించుకొని తమ పాఠశాలల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ ఉందని ప్రత్యేక తర్ఫీదు పొందిన ఉపాధ్యాయ బృందం ఉందని స్పెషల్ క్లాస్ లు ఉంటాయని తల్లిదండ్రులను బురిడి కొట్టించి అందినకాడికి లాగుతున్నాయనే ఆరోపణలు లేకపోలేదు. టెక్నో, గ్లామర్, మోడల్, డీజీ, కాన్సెప్ట్ వంటి తోక పేర్లు తగిలించుకొని ప్రత్యేక ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకపోవడంతో ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల వసూళ్ల విషయంలో ఇష్టారీతిన వ్యవహరిస్తూ దోచుకుంటున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యాశాఖ మాత్రం పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రైవేట్ పాఠశాలల్లో అడ్డు, అదుపు లేని ఫీజుల వసూళ్లతో విద్యార్థుల తల్లిదండ్రులు మోయలేని భారంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఫీజుల నియంత్రణ విషయంలో చట్టం తీసుకురావాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

**పుస్తకాల ధరలు ఆకాశంలో...**

ప్రైవేటు పాఠశాలలో ఉపయోగిస్తున్న పుస్తకాలకు సంబంధించి ధరలు చూస్తే విస్తుపోవాల్సిందే. గతేడాది నర్సరీ, యూకేజీ, ఎల్ కేజీ చదివే పిల్లలకు రూ. 3వేల లోపే పుస్తకాలు, నోట్స్ లు వచ్చేవి. రూ. 3వేలకు తగ్గకుండా పుస్తకాలు, నోట్ పుస్తకాలు తీసుకున్నారు. ఈసారి అవి అమాంతం పెరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుత మార్కెట్ లో పేపర్ ధర రెట్టింపు కావడంతో ఈ విద్యా సంవత్సరం పుస్తకాలు, నోట్ పుస్తకాల ధరలు అమాంతం పెరిగే ఛాన్స్ ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే ఆయా పాఠశాలల యాజమాన్యాలు మాత్రం పుస్తకాలు, నోటు పుస్తకాలను తమ పాఠశాలల్లోనే కొనాలని నిబంధనలు విధిస్తున్నాయి. బయట కొనుగోలు చేస్తే ఎంతో కొంత బేరం ఆడితే రేట్లను కొంతైనా తగ్గించే వారని కానీ పాఠశాలల్లో విక్రయించే పుస్తకాలకు అడిగినంత ఇవ్వాల్సిందేనని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇది కూడా తమకు మోయలేని ఆర్థిక భారమేనని ఆందోళన చెందుతున్నారు..

**బ్యాగులు, షూస్ అన్ని భారమే...**

ఈ విద్యా సంవత్సరం మార్కెట్ లో పిల్లలకు సంబంధించిన పుస్తకాలు, బ్యాగులు, వాటర్ బాటిళ్లు, షూస్ ఇలా అన్ని రకాల వస్తువుల ధరలు పెరగడం తల్లిదండ్రులకు భారంగా మారింది. తోటి పిల్లలు రకరకాల వస్తువులు తెచ్చుకుంటుంటే తమ పిల్లలకు ఏది తక్కువ కాకూడదన్న భావనతో తమ ఆర్థిక పరిస్థితి అంతగా లేకున్నా ఋణమో, తృణమో తెచ్చి తమ పిల్లలకు తల్లిదండ్రులు అన్ని రకాల వస్తువులను సమకూరుస్తున్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం మార్కెట్ లో అన్ని రకాల వస్తువుల ధరలు పెరగడంతో తల్లిదండ్రులు మరింత ఆర్థిక భారం కానుంది. ఏది ఏమైనా ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లపై ప్రభుత్వం చట్టం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పనిలో కాదు ... బాల్యం బడిలో...

**అశ్వారావుపేట,జూన్11,ప్రజాజ్యోతి:**

బాల్యాన్ని ఇబ్బంది పెట్టే రీతిలో పిల్లలతో పని చేయించడం వారి శారీరక, మానసిక ,సామాజిక అభివృద్ధికి అవరోధమే.. అక్షరాస్యతతో వినోదాన్ని పొందే అవకాశం లేకుండా చేసే పనిని.. స్థితిని, బాల కార్మిక వ్యవస్థగా పరిగణించాలి. బాలలంటే 5వ సంవత్సరం నుంచి 14వ సంవత్సరాల వయసు గలవారు. తల్లిదండ్రుల పేదరికం, నిరక్షరాస్యత వలన నేటికీ ఎందరో బాలలు బాల కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. కుటుంబ అవసరాల కోసమో.. అదనపు ఆదాయం కోసం పేద కుటుంబాలలోని పిల్లలను పనుల్లోకి పంపిస్తూ, చదువుకోవాలన్న చిన్నారుల తపనను కొందరు తల్లిదండ్రులు అర్థం చేసుకునే స్థితిలో లేరు. బాలకార్మిక వ్యవస్థకు అసలు కారణం పేదరికమే. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు కూడా అనేక సర్వేల ద్వారా తేల్చిన విషయాలివే. గ్రామాలు పట్టణాలు అనే తేడా లేకుండా తల్లిదండ్రుల పేదరికం పిల్లలకు శాపంగా మారుతోంది. చిన్నారులు చదువుకోవాల్సిన వయస్సులో కుటుంబ అవసరల కోసం పనిచేయాల్సిన పరిస్థితి వస్తుంది. వ్యవసాయంలోనూ, చేతివృత్తుల పనుల్లో తల్లిదండ్రులకు సాయంగా వెళ్ళేవారు కొందరైతే, కర్మాగారాల్లో, దుకాణాల్లో, ఇతర పనుల్లోకి వెళ్ళి తల్లిదండ్రులకు ఆర్థిక సాయాన్ని అందించేవారు మరికొందరు. తల్లిదండ్రుల అవగాహనా రాహిత్యంతో పాటు బాల కార్మిక చట్టాలు సరిగా అమలు కావడం లేదనే వాదన కూడా మరో వైపు వినిపిస్తోంది. తల్లిదండ్రులు పిల్లల తాత్కాలిక సంపాదన ఆశించడం వలన, కొందరు చిన్నారులు చదువుకోవాలన్న ఆలోచనను కూడా విరమించుకుంటున్నారు. అలాంటి వారు తాత్కాలిక ప్రయోజనం ఆశించకూడదు. చదువుకోవాలని పిల్లలను వాళ్ల తల్లిదండ్రులు ప్రోత్సహించిన నాడే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనవుతుంది.

**బాల కార్మిక వ్యవస్థను నిర్మూలన కోసం చేపట్టాల్సినవి**

బాలకార్మిక వ్యవస్థపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. ఎదుటి వారికీ అవగాహన కల్పిస్తూ సమాజంలో మార్పు తీసుకువచ్చేలా ప్రతి ఒక్కరూ ఎంతో కొంత కృషిచేయాలి. ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు వారి కార్యకలాపాల్లో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనను ఒక భాగంగా చేస్తూ,సమస్య తీవ్రతను తెలియజేసే కార్యక్రమాలు నిర్వహించాలి. మన ఇళ్లల్లో పిల్లలు పనిచేయకుండా, ఉపాధి చూపించే వారికి పిల్లలకు పనులు ఇవ్వొద్దని తెలియజేయాలి. మన చుట్టూ ఉండే చిన్నారులు పాఠశాలలకు వెళ్లేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి.

**చిన్నారులకు సామాజిక రక్షణ అందించాలి..**

పేదరికం, నిరక్షరాస్యత కారణంగా చాలా మంది చిన్నారులు చదువుకు దూరమవుతున్నారు. ఆర్థిక పరిస్థితులు బాగాలేవని పిల్లల్ని కూలీ పనులకు తీసుకెళుతున్నారు తల్లిదండ్రులు. ఇది చాలా చోట్ల చూస్తున్నదే. చిన్నారులతో పని చేయించటం నేరం అని తెలిసినా ఎవరూ పట్టించుకోవటం లేదు. చట్టాలు కఠినంగా ఉన్నా అన్ని చోట్లా ఇది అమలు కావటం లేదు. ఈ సమస్యను పరిష్కారించాలన్న పిలుపుతో ఏటా జూన్ 12వ తేదీన ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రత్యేక నినాదంతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 15 కోట్ల మంది పిల్లలు, యుక్త వయస్కులు ప్రమాదకరమైన స్థలాల్లో పని చేస్తున్నట్టు అధికారిక లెక్కలే చెబుతున్నాయి. వీరందరినీ ఈ వలయం నుంచి బయటపడేయాలన్నదే ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం ప్రధాన ఉద్దేశం. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు "చిన్నారులకు సామాజిక రక్షణ" లక్ష్యంగా ప్రభుత్వాలతో పాటు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరాలి



(మొదటి పేజీ తరువాయి)

వృద్ధులకు, వికలాంగులకు, వితంతు మహిళలకు, ఒంటరి మహిళలకు, ఆసరా పింఛన్లు అందేలా చూడాలని, అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గ్రామపంచాయతీలలో మౌలిక వసతుల కల్పన, రోడ్లు, డ్రైనేజీలు, అంగన్వాడి స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో ఏమైనా రిపేర్లు ఉంటే సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తయ్యే విధంగా చూడాలని అన్నారు. ప్రభుత్వ అధికారులు ఉద్యోగులు ప్రజలకు సేవ చేయడానికి విధులు నిర్వహిస్తున్నారని, తప్పనిసరిగా ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో 39 వేల కోట్లు ఖర్చు చేసిన గ్రామాలలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, మా ప్రభుత్వం వచ్చాక మిషన్ భగీరథ ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలలోని ప్రతి ఇంటికి మంచి నీరు అందే విధంగా చర్యలు చేపట్టామని, గిరిజన గ్రామాలలో నిర్మాణం చేపట్టే రోడ్లు ఫారెస్ట్ వారు అడ్డంకులు సృష్టిస్తే దానికి సంబంధించిన ప్రతిపాదనలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించి అన్ని గిరిజన గ్రామాలలో రోడ్డు సౌకర్యం కల్పించాలని, భద్రాచలం కొత్తగూడెం డివిజన్లలో 30 శాతం కంటే ఎక్కువ నిర్మాణం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని అన్నారు. అమ్మ ఆదర్శపాఠశాల పనులు త్వరగా పూర్తిచేసి పిల్లలకు ఇబ్బంది కలగకుండా పండుగ వాతావరణంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులను సంప్రదించి పాఠశాలలను ప్రారంభోత్సవం చేయాలని, అదే రోజు పిల్లలకు బుక్స్, యూనిఫామ్ మిగతా మెటీరియల్ అందజేయాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజక వర్గంలోని గ్రామాలలో అమ్మ ఆదర్శ పాఠశాలలను పిల్లలకు మొదటి విడతగా తెలుగు లో విద్యాబోధన ప్రారంభించామని, రాబోయే రోజుల్లో ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన ప్రవేశపెట్టి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడానికి రాష్ట్రంలో 650 కోట్లు పైచిలుకు డబ్బులు ఖర్చు పెట్టి పెద్ద ఎత్తున పాఠశాలల నిర్మాణం చేపట్టామని, 80 శాతం వరకు పాఠశాలలు పూర్తయ్యాయని, వారం రోజుల్లో అన్ని పాఠశాలలు పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశామని, తెలంగాణ రాష్ట్రంలో విద్యను బలోపేతం చేయడానికి స్కూల్స్ తో పాటు కాలేజీల నిర్మాణం కూడా చేపట్టామని అన్నారు. ఎటువంటి అవతవకలు జరగకుండా ధరణి దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియ ముఖ్యంగా గిరిజన గ్రామాలలోని రైతులకు ఇబ్బందులు కలగకుండా పూర్తి చేయాలని ధరణి ఆన్లైన్ ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు తన దృష్టికి వస్తే తప్పనిసరిగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల 45 వేల పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులు ఎలక్షన్ కోడ్ రాకముందే లక్ష వరకు క్లియర్ చేశామని, ఆ తర్వాత మిగిలిన దరఖాస్తులు కొత్తగా రైతులు సమర్పించిన దరఖాస్తులు కలుపుకొని రెండు లక్షల 55 వేలు పెండింగ్ లో ఉన్న వాటిని ధరణి లోపాలు సరిదిద్ది యుద్ధ ప్రాతిపదికన వారం రోజుల్లో పరిష్కరిస్తామని, దీనికోసం ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేశామని అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గం లో కొన్ని గ్రామాలలో ముఖ్యంగా చేతకొండ, రేగళ్ల ,పాల్వంచ లలో వేల ఎకరాలు భూములకు ఆన్లైన్ ప్రక్రియలలో సమస్యలు వస్తున్నాయని తన దృష్టికి వచ్చిందని, నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్ సమన్వయంతో ఒక వారం రోజుల్లో సమస్య పరిష్కరించుకోవాలని అన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున వైద్యం పరంగా మారుమూల గిరిజన గ్రామాలలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని పీహెచ్సీలలో సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవాలని, మారుమూల గ్రామాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేకంగా అంబులెన్సును అందుబాటులో ఉంచుకోవాలని, వైద్య సిబ్బంది స్థానికంగా ఉండేలా సంబంధిత వైద్యశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రిమోట్ ఏరియాలలో నియోజకవర్గాలలోని శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ తో పాటు ఐటీడీఏ పీవో, ఆర్డీవోలు జిల్లా అధికారులు అన్ని ఆసుపత్రులను తనిఖీ చేయాలని, అన్ని ఆసుపత్రులలో సిబ్బంది అందరూ ఉండేలా చూడాలని ఏదైనా గ్రామాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మాణం అసంపూర్తిగా ఉంటే వెంటనే పూర్తి చేయాలని అన్నారు. భద్రాచలం నియోజకవర్గం లో ఎక్కువ శాతం గిరిజన గ్రామాలలో త్రి ఫేస్ కరెంటు సరిగా లేదని దానికి సంబంధించిన సర్వే చేపట్టి ప్రతిపాదనలను సమర్పించాలని అలాగే వైరా నియోజకవర్గంలో ఎక్కువ శాతం గిరిజనులు నివసించే గ్రామాలు ఎక్కువగా ఉన్నందున ఫారెస్ట్ వారు అడ్డంకి లేకుండా చేసి వ్యవసాయ భూములకు కరెంటు, బోర్లు వేయించాలని అన్నారు. జిల్లాలోని రైతులకు నాణ్యమైన విత్తనాలతో పాటు ఆగస్టు సెప్టెంబర్ మాసం వరకు ఎరువులు సిద్ధంగా ఉంచి రైతులందరికీ అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కరెంటు సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు. అలాగే ఆగస్టు 15వ తేదీలోగా రైతులందరికీ రుణమాఫీకి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసుకుని రుణమాఫీ చేయడానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు హామీ ఇచ్చారని ఆయన అన్నారు. అలాగే ప్రభుత్వ భూములు గానీ ప్రజలకు సంబంధించిన పట్టా భూములు గాని ఎవరైనా కబ్జా చేసినట్లు తన దృష్టికి వస్తే వెంటనే వారిపై క్రిమినల్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, అశ్వరావు పేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, జెసి వేణుగోపాల్, డిఆర్ఓ రవీంద్రనాథ్, కొత్తగూడెం ఆర్ డి ఓ మధు, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, డీఎఫ్ఓ కృష్ణ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ లు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి వారసత్వ ఉద్యోగుల వయో పరిమితి పెంపు

**- ఐఎన్టీయుసి హర్షం ...**
**- సీఎంకి, సింగరేణి సిఎండి కి, ఐఎన్టియుసి నాయకుల కృతజ్ఞతలు తెలిపిన ఎస్సిఎంఎల్ యు నాయకులు**




*మణుగూరు, జూన్ 11, ప్రజాజ్యోతి:* సింగరేణి వారసత్వ ఉద్యోగుల నియామక వయో పరిమితి 35 నుండి 40 ఏళ్లకు పెంపు సర్క్యులర్ (ఆదేశాలు) విడుదలపై సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐ ఎన్ టి యు సి) మణుగూరు ఏరియా బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షులు వత్సవాయి కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి సిల్వేరు గట్టయ్య యాదవ్ లు హర్షం వ్యక్తం చేశారు, పీవీ కాలనీ ఐ ఎన్ టి యు సి కార్యాలయంలో మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు, ఆదేశాలు జారీ చేసిన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, సబంధిత శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకి, సింగరేణి సిఎండి బలరాం నాయక్ (ఐఆర్ఎస్) కి మరియు ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బి జనక్ ప్రసాద్ కి వారు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి కార్మిక గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్టియుసి ఇచ్చిన హామీలలో ఒక్కొక్కటి నెరవేర్చుకుంటూ వస్తున్నామని తెలిపారు. ఈ ఆదేశాలతో వారసత్వ ఉద్యోగుల చిరకాల వాంఛ నెరవేరినట్లుగా వారు అభివర్ణించారు, 35 ఏళ్లకు వయసు పైబడి ఉద్యోగాలు రావని నిరాశ, నిస్పృహలతో ఉన్న డిపెండెంట్ లకు 40 ఏళ్లకు వయోపరిమితి పెంపు సర్క్యులర్ ఎంతగానో లబ్ధి చేకూర నుందని వారు అభిప్రాయపడ్డారు, ఈ సంవత్సరం ఫిబ్రవరి 7వ తేదీ హైదరాబాద్ భారతరత్న డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన 441 మంది సింగరేణి నూతన ఉద్యోగుల నియామక పత్రాల అందజేత కార్యక్రమం సందర్భంగా తమ నాయకులు బి జనక్ ప్రసాద్ వయోపరిమితి అంశాన్ని లిఖితపూర్వకంగా దరఖాస్తు రూపంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళటం అనంతరం స్పందించిన ముఖ్యమంత్రి సంబంధిత శాఖ మంత్రి బట్టి విక్రమార్క తో చర్చించి అదే వేదికపై సింగరేణి ఉద్యోగులపై ఉన్న ప్రత్యేక అభిమానంతో మా ప్రభుత్వం వయోపరిమితి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తుందని సభికుల హర్షద్వారాల మధ్య ప్రకటించడంతోపాటు దీనిపై సర్క్యులర్ విడుదల చేయాలని అక్కడికక్కడే సింగరేణి సిఎండి ఎం బలరాంకి కూడా ఆదేశాలు జారీ చేశారు. అన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు, ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొంత జాప్యం జరిగిందని కోడ్ ఎత్తివేసిన వెంటనే సర్క్యులర్ జారీ అయిందని ఆయన తెలిపారు. వీలైనంత త్వరగా కార్పొరేట్ మెడికల్ బోర్డు నిర్వహించాలని ఎలాంటి షరతులు లేకుండా, కొర్రి పెట్టకుండా వయోపరిమితి పెంపు సర్క్యులర్ అమలు చేయాలని ఆయన సింగరేణి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, సిల్వేరు గట్టయ్య యాదవ్, సూరపాక రాములు, షేక్ మస్తాన్, మిద్దెపాక శ్రీనివాస్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

# రక్షకుడా.. బక్షకుడా...!

**-కెఓసి ఆంబులేన్స్ డ్రైవర్ ను కొట్టిన కానిస్టేబుల్**
**-విచక్షణ రహితంగా కొట్టిన వైనం...?**
**-కానిస్టేబుల్ చిమల కృష్ణ ప్రసాద్ పై చర్యలు తీసుకునేనా..!**





*టేకులపల్లి, జూన్ 11, ప్రజాజ్యోతి:* ప్రజలకు ఎల్లవేళలా తాము ఉన్నామని భరోసానిచ్చి వారికి ధైర్యంగా ఉండాల్సిన రక్షకబటులే, ప్రజల పాలిట బక్షకులుగా మారిన పరిస్థితి నెలకొంది. తమను ఎవరు అడిగే వారు లేరని ధీమాలో ఇష్టాను సారంగా కొట్టడం ఆ కానిస్టేబుల్ కు ఉన్నత పెట్టిన విద్య అనే విమర్శలు ఉన్నాయి. మండలంలోని కోయగూడెం ఓసిలో ఆంబులెన్స్ డ్రైవర్ గా బిక్షంపై కానిస్టేబుల్ చీమల కృష్ణ ప్రసాద్ సోమవారం రోజున విచక్షణ రహితంగా కొట్టడం జరిగిందని బాధిత డ్రైవర్ భిక్షం వాపోయాడు. సింగరేణి కాలనీలో ఒకరికి అనారోగ్య సమస్యల కారణంగా అంబులెన్స్ సౌకర్యం కోసం ఆ ఆ విభాగానికి కాల్ చేయడం జరిగింది. సదురు డ్రైవర్ అంబులెన్స్ తో పాటు అక్కడికి వెళ్ళగా ఆ కుటుంబ కలహాల నేపథ్యంలో పోలీసు స్టేషన్ కు వెళ్లడం జరిగిందని డ్రైవర్ తెలిపారు. దీంతో అంబులెన్స్ డ్రైవర్ బిక్షం కుటుంబ యజమాని పోలీస్ స్టేషన్లో ఉండడంతో అతని వద్దకు వెళ్ళగా ఎవరు నువ్వు ఎందుకు వచ్చావు అని అడగకుండా కానిస్టేబుల్ చిమల కృష్ణ ప్రసాద్ (కెపి) విచక్షణ రహితంగా కొట్టినట్లు డ్రైవర్ పేర్కొన్నారు. సార్ నేను సింగరేణి అంబులెన్స్ డ్రైవర్ బిక్షం అని, అనారోగ్య సమస్యల వల్ల అంబులెన్స్ కోసం ఫోన్ చేస్తే తమ అధికారులు పంపడం జరిగిందని చెప్పినా కానీ మాట వినకుండా ఇష్టానుసారంగా లాఠీతో కొట్టడం జరిగిందని వాపోయారు. అంబులెన్స్ డ్రైవర్ బిక్షంపై కానిస్టేబుల్ చీమల కృష్ణ ప్రసాద్ దాడి చేయడం హేయమైన చర్య అని, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తూ కానిస్టేబుల్ పై చర్యలు తీసుకోవాలని బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు దాసరి రాజారామ్ లు మంగళవారం ఒకే ప్రకటనలో డిమాండ్ చేశారు.

# ఆదివాసీ గ్రామాలలో మొదలైన భూమి పండుగ సందడి





*భద్రాచలం, జూన్ 11, ప్రజాజ్యోతి*

తరతరాలుగా ఆదివాసీలు అత్యంత వైభవంగా నిర్వహిస్తూ వస్తున్న భూమి పండుగ రానే రావడంతో ఒక్కసారిగా గిరిజన గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి ఏటా తొలకరి వానలు ప్రారంభమవుగానే వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు గ్రామస్తులంతా ఎంతో విశ్వాసంగా కొలిచే గ్రామ దేవతలకు అంతే భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, తమ వ్యవసాయ క్షేత్రాలలో భూమి పూజ చేయడం ఇక్కడ ఆనవాయితీ. వ్యవసాయ ఆధారిత గిరిజన గ్రామాల ప్రజలు గత నాలుగు నెలలుగా పనులు లేకపోవటంతో, ఆర్థిక వెసులుబాటు లేక అనేక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా వర్షాలు ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న ఆదివాసి రైతు కూలీలు. ఇక ప్రతి ఏటా వ్యవసాయ పనులు ప్రారంభించే ముందు తాము పండించే పంటలు విస్తారంగా పండి, మంచి దిగుబడి వచ్చి, తమ పల్లెలు పచ్చగా ఉండాలని వేడుకుంటూ పల్లెల్లో ఉన్న ఆదివాసీలంతా కలిసి భూమి పండుగ నిర్వహిస్తూ ఉంటారు.. ఈ నేపథ్యంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని గిరిజన గ్రామాలలో తాము అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించే గ్రామదేవతలకు పూజలు నిర్వహించి, తమ గ్రామాలు సుభిక్షంగా ఉండాలని దేవుడిని ప్రార్థిస్తారు. యాటపోతులను, కోళ్లను కోసి విందు చేసుకుంటారు. ఇందుకుగాను వాళ్ళ గ్రామాల వెంబడి ఉన్న రహదారుల పైకి వచ్చి ఆటపాటలతో వాహనదారులను అలరిస్తూ వారి వద్ద నుంచి కానుకలను పొందుతూ, వారికి ఆశీర్వచనాలు అందజేస్తూ ఉండడం విశేషం. ఏది ఏమైనా వ్యవసాయ పనులనే జీవనాధారంగా చేసుకొని బ్రతుకుతున్న ఆదివాసీలకు, తొలకరి జల్లు పడగానే తమ బ్రతుకులు చిగురించినట్లుగా భావించే అమాయక ఆదివాసీల మోములో చిరునవ్వులు వెధజల్లుతున్నాయనే చెప్పవచ్చు.

# విద్యార్థులను "హమాలీలుగా" మార్చిన ఉపాధ్యాయులు



*జూలూరుపాడు, జూన్ 11, ప్రజాజ్యోతి*

విద్యార్థులకు చదువు చెప్పి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దవలసిన ఉపాధ్యాయులు వారిచేత వ్యక్తి చాకిరి పనులు చేయిస్తున్న సంఘటన జూలూరుపాడు మండల కేంద్రంలోని చోటు చేసుకుంది, వివరాల్లోకెళ్తే మంగళవారం ఎంఈఓ కార్యాలయంలో పాఠశాలలకు చేరవేసే పుస్తకాలను పాఠశాలకు సరఫరా చేయుటకు ట్రాలీ ఆటలో పాఠశాలకు విద్యార్థులతో పుస్తకాలను మోయిస్తూ విద్యార్థులను హమాలీలు గా ఉపాధ్యాయులు మార్చారని , పాఠశాల సరఫరా చేయుటకు ట్రాలీ ఆటోలో పాఠశాల విద్యార్థులతో పుస్తకాలను మోహిస్తూ, ట్రాలీ లో పెట్టిస్తూ ఉన్నారని హమాలీలుగా మార్చిన ఉపాధ్యాయులపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, ఉపాధ్యాయులపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# 8వేలు విలువ గల గుట్కాప్యాకెట్లు స్వాధీనం



*మణుగూరు క్రైమ్, జూన్ 11, ప్రజాజ్యోతి*

మణుగూరు పట్టణంలో విచ్చలవిడిగా గుట్కాలు అమ్ముతున్నారని సమాచారం అందడంతో స్థానిక సీఐ ఆదేశాల మేరకు ఎస్సై మేడా ప్రసాద్ మంగళవారం పలు షాపులలో తనిఖీలు చేయగా మహాలక్ష్మి కిరాణా షాప్ నందు ఎనిమిది వేలు విలువ గల నిషేధిత గుట్కాప్యాకెట్లు స్వాధీనం చేసుకొని యాజమాని ప్రజాపత్ బేరా రాం పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు, జెసిబిలను సీజ్ చేసిన ఫారెస్ట్ అధికారులు




*బూర్గంపాడు, జూన్ 11, ప్రజాజ్యోతి*

మండల పరిధిలోని సందేళ్ల రామాపురం గ్రామంలోని ఫారెస్ట్ లో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు ఒక జెసిబి ని ఫారెస్ట్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం రేంజ్ స్టాప్ రమేష్, వీఆర్వోలు సుజాత, వీరబాబు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో టాయిలెట్ బ్లాక్ శంకుస్థాపన



భద్రాచలం, జూన్ 11, ప్రజాజ్యోతి.

స్థానిక గర్ల్స్ హై స్కూలు భద్రాచలం నందు రోటరీ క్లబ్ అధ్యక్షురాలు మహాలక్ష్మి గారి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ భద్రాచలం మరియు లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ వారి సంయుక్తం నిర్మిస్తున్న టాయిలెట్ బ్లాక్ శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మల్లాది వాసుదేవ్ గారు రావటం జరిగింది వాసుదేవ్ గారు మాట్లాడుతూ భద్రాచలం క్లబ్ ఏజెన్సీ ప్రాంతంలో అనేక మంచి కార్యక్రమాలు చేస్తోంది దానిలో భాగం గానే 8 లక్షలతో ఈరోజు ఈ టాయిలెట్ బ్లాక్ నిర్మించటం జరుగుతోంది అని చెప్పటం జరిగింది. ఈ కార్యక్రమంలో గర్ల్స్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రమ,ప్రోగ్రాం చైర్మన్ మునికేశవ్ కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి విద్యాసాగర్, పాస్ట్ ప్రెసిడెంట్స్ యశోద రాంబాబు,బ్రహ్మ రెడ్డి, జకరయ్య,నాగేశ్వరరావు,వసంతరావు ప్రెసిడెంట్ ఎలెక్ట్ బాలాజీ మరియూ,అజీమ్, భద్రం,వంద వాసు,వరలక్ష్మి,విక్టోరియా, సీతారామ రాజు,చలపతి,హర్షద్,బిల్డర్ ఆంజనేయులు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బహుళ అంతస్తులు కట్టిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

- బి. ఏ ఎస్ పి ఏవి ఎస్ పి



దుమ్ముగూడెం, జూన్ 11, ప్రజాజ్యోతి

మంగళవారం నాడు చిన్న నల్లబెల్లి గ్రామ పరిధిలో ఏర్పాటు అయిన అత్యవసర సమావేశంలో భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు సోంది మల్లుదొర మాట్లాడుతూ ఆదివాసి చట్టాలను కాల రాస్తుంది పంచాయతీరాజ్ శాఖ అని మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంతమైనటువంటి ఈ యొక్క మండలంలో లక్ష్మీనాగారం మరియు ములకపాడు జాతీయ రహదారి గుండా ఉన్నటువంటి వివిధ పంచాయతీ గ్రామాలలో 1/70 చట్టానికి విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకున్నా విచ్చలవిడిగా బహుళ అంతస్తులు కడుతున్న వాటిని నిలుపుదల చేయాల్సిన పంచాయతీ కార్యదర్శులు నిమ్మకు నీరెత్తిన్నట్టుగా చూసిచూడనట్టుగా వ్యవహరించడం జరుగుతా ఉన్నది. ఇటువంటి చట్ట విరుద్ధంగా వెలుస్తున్నటువంటి కొందరు గిరిజనేతర్ల అక్రమ భవనాలను అరికట్టడంలో ముఖ్యంగా రెవెన్యూ శాఖ తర్వాత పంచాయతీ రాజ్ శాఖలో ఈ పరిస్థితి కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలుమార్లు పంచాయతీ కార్యదర్శులకు తెలియజేసిన పట్టింపు లేనట్టుగా వ్యవహరించడం జరుగుతుందని వాపోయారు. ముఖ్యంగా ములకపాడు పరిధిలో లక్ష్మీనాగారం గ్రామ పంచాయతీ పరిధిలో ఏజెన్సీ చట్టానికి విరుద్ధంగా రోజు రోజుకు హద్దు అదుపు లేకుండా వెలుస్తున్నట్టి కొందరి గిరిజనేతరుల బహులంతస్తులు అట్టి పంచాయతీ కార్యదర్శుల ప్రోత్సాహం తోనే అని వ్యాఖ్యనించారు. ఆ యొక్క బారి భవనములు ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా మేడ మీద మేడ కడుతున్న వారికి ఏ విధంగా అనుమతులు ఇచ్చి ఉన్నారు అని, వారి టకి ఇచ్చిన అనుమతులు ఏంటి అని సమాచారం చట్ట ప్రకారం అడిగితే ఆ యొక్క సమాచారం ఇవ్వడంలో పంచాయతీ కార్యద ర్శులు నిర్లక్ష్యం వహిస్తూ, ఆ యొక్క అక్రమ కన్స్ట్రక్షన్స్ నులు ఆపూదల చేయడంలో శ్రద్ధ చేయడం లేదని మండిపడ్డారు. ఆ యొక్క బహుళం తస్తు లు కడుతున్న వారికి వంత పలుకుంటూ కడుతున్న వారికి ఆధారాలు ఉన్నా యాని చెప్పుకుంటూ వచ్చే పరిస్థితి పంచాయతీ అధికారులలో కనపడుతుం దని, ఇలాంటి వాటిపై రెవెన్యూ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోని కేసులు నమోదు చేయాలని, లేకపోతే ఉన్నత అధికారు లకు ఫిర్యాదు చేస్తా మని హెచ్చరించారు. పాయం రాములు వీరయ్య వెంకటేశ్వరరావు కల్లూరు శ్రీరాములు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

- కనుబుద్ది దేవా

దుమ్ముగూడెం, జూన్ 11, ప్రజాజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్ల పాల్వంచ ఇల్లందు ఆస్పత్రులకు డయాలసిస్ యూనిట్లు మంజూరు చేయడం చాలా సంతోషకరమని కనుబుద్ది దేవా అన్నారు ఒక్కొక్క ఆసుపత్రికి ఐదు మిషన్లో చొప్పున 15 డయాలసిస్ మిషన్లను ఏర్పాటు చేస్తూ ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ తెలంగాణ రాష్ట్ర హెల్త్ అండ్ మెడికల్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ ఉత్తర్వులు విడుదల చేసింది గత ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా అభివృద్ధి నోచుకోలేదు అభివృద్ధి లో జిల్లా వెనుక పడింది కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి జిల్లా ని అభివృద్ధి లో



ముందుకు తీసుకువెళ్తున్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒక్కొక్క ఆసుపత్రికి 5 యూనిట్లో చొప్పున మూడు ఆసుపత్రులకు 15 యూనిట్లు ఏర్పాట్లు చేశారు ప్రభుత్వ పెద్దలను కలిసి దుమ్ముగూడెం మండలానికి కూడా డయాలసిస్ కేంద్రం వచ్చేలా కృషి చేస్తామని అన్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి కి సహకరిస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎను ముల రేవంత్ రెడ్డి గారికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారికి ఉమ్మడి ఖమ్మం మంత్రులు తుమ్మల నాగేశ్వరావు గారికి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొదెం వీరయ్య గారికి జిల్లాలోని ఉన్న నియోజవర్గ ఎమ్మెల్యేలు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను.

## సింగరేణి డిపెండెంట్‌ల వయస్సు పెంపు

టేకులపల్లి, జూన్ 11, ప్రజాజ్యోతి:

సింగరేణిలో గతంలో డిపెండెంట్ ఉద్యోగం కోసం వయసు 35 సంవత్సరాలను 40 సంవత్సరాలకు పెంచాలని ఏఐటియుసి కృషి ఫలితంగానే యాజమాన్యం మంగళవారం సర్క్యులర్ జారీ చేయడం జరిగిందని ఏఐటియుసి బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం స్థానిక కెఓసి లో జరిగిన పిట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వయసు పెంచాలని ఏఐటియుసి యాజమాన్యానికి గత 3 నెలల క్రితం గుర్తింపు సంఘంగా విజ్ఞప్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ వల్ల ఆలస్యమైందన్నారు. కార్మిక సోదరులు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కృషిని గమనించాలని కోరారు. వయస్సు పెంపుదల విషయంలో వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్ కుమార్ ల కృషి ఎంతో ఉందని, వారికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర




గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ కృష్ణ, ఫిట్ సహాయ కార్యదర్శులు బానోత్ బాలాజీ, షెక్ సర్వర్, వర్క్మెన్ ఇన్స్పెక్టర్ జీఎ శ్రీనివాస్, సామల శ్రీనివాస్, వెంగల రవి, కాలే పుల్లయ్య, బండి సీతారాములు, రామకృష్ణ చారి పాల్గొన్నారు.

## ఖాజా గౌస్‌కు ఘన సన్మానం



ఇల్లందు, జూన్ 11, ప్రజాజ్యోతి:

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పంజాబ్ రాష్ట్రానికి కో అబ్జర్వర్ గా నియమితులై కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం తన వంతు కృషి చేసిన యండి ఖాజ గౌస్ మొహీనుద్దీన్ ను మంగళవారం జేకే ఓసిలో ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్ త్యాగ రాజన్, ఇల్లందు వైస్ ప్రెసిడెంట్ జె. వెంకటేశ్వర్లుల ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. మొదటి నుంచి కాంగ్రెస్, ఐఎన్టియుసిలో కొనసాగుతున్నందున పార్టీ పంజాబ్ ఎన్నికల బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. లూదియనాలో అమరేందర్ సింగ్ రాజా, చండిఘడ్ లో మనిష్ తివారి అత్యధిక మెజారిటీతో గెలిచేందుకు ఖాజా గౌస్ కృషి ఎంతో ఉందని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ నాయకులు మహబూబ్, ఐఎన్టియుసి నాయకులు పడిదల నవీన్, గోచికొండ సత్యనారాయణ, కళ్లెం కోటి రెడ్డి, మేకల రమేష్, పాలెపు సత్యనారాయణ, అన్వర్, ఇమామ్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## ఐఎఫ్టీయు 4వ మహాసభను జయప్రదం చేయండి

టేకులపల్లి, జూన్ 11, ప్రజాజ్యోతి:

ఐఎఫ్టియు టేకులపల్లి ఏరియాలో ఈనెల 14 నుంచి జరగనున్న 4వ మహాసభను జయప్రదం చేయాలని ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న, ఐఎఫ్టియు జిల్లా నాయకులు జరుపుల సుందర్ లు కోరారు. మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం ఐఎఫ్టియూ నిరంతర పోరాడుతుందని తెలిపారు. కార్మికుల తరపున నిజాయితీగా పనిచేస్తుందని, కార్మికుల వేతనాల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై జరిగిన పోరాటాల ముందుగా నిలబడడం జరిగిందని గుర్తు చేశారు. సింగరేణి, హామాలి, ఆటో మోటార్స్ వర్కర్స్, గ్రామపంచాయతీ, మధ్యాహ్న భోజనం వర్కర్స్, ఆశ వర్కర్ల, అంగన్వాడి తదితర రంగాల కార్మికుల తరపున నిరంతరం పోరాడడం జరుగుతుందని



పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిహెచ్. వెంకటేశ్వర్లు, దనసరి భద్రం, కల్తీ వీరస్వామి, సైదులు, అన్వేష్, ప్రశాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురిపై బైండోవర్

టేకులపల్లి, జూన్ 11, ప్రజాజ్యోతి:

మండలానికి చెందిన వేరు వేరు గ్రామాలలో నాటు సార తో పట్టుబడిన ఐదుగురు పై మంగళవారం తహసిల్దార్ నాగ భవాని ఎదుట బైండో వర్ చేశా రు. ఎక్సైజ్ ఎస్ఐ అచ్చరావు తెలిపిన వివరాల ప్రకారం బొమ్మనపల్లి గ్రామా నికి చెందిన ముగ్గురు, కొత్త తండకు చెందిన ఒకరు, పాత తండాకు చెందిన ఒకరు నాటు సారతో పట్టుబడటంతో వారిపై బైండోవర్ నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రవిబాబు పాల్గొన్నారు.



# నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**- ఎమ్మెల్యే కూనంనేని**

*కొత్తగూడెం, జూన్ 11, ప్రజాజ్యోతి*

మొర్రేడు రెండవ వంతెన నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. పనుల జాప్యం వలన స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను శ్రీనగర్ కాలనీ మాజీ ఉపసర్పంచ్ సీపీఐ నాయకులు లగడపాటి రమేష్ చంద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కు తెలిపారు. ఈసందర్భంగా కూణంనేని మాట్లాడుతూ వం తెనకు ఇరుపక్కల సర్వీస్ రోడ్ నిర్మించాలని, డ్రెయిన్స్ నిర్మించాలని, రోడ్డు మధ్యలో ఉన్న కరెంటు పోల్స్ ని తొలగించాలని ఈ పనులన్నీ రేపటి నుండి ప్రారంభించాలని ప్రజలకు ఎటు వంటి అసౌకర్యం కలగకుండా ఉండా లని ఆయన జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు.



సర్వీస్ రోడ్లు 7 మీటర్లకు తగ్గకుండా ఉం డాలని ఈ పనులు పూర్తయిన తర్వా తనే రెండవ వంతెన మీద వాహనాలు వెళ్లే విధంగా ఉండాలని అప్పటివరకు రెండవ వంతెన మీద వాహనాలు వెళ్లకుండా నిలిపివేయాలని ముర్రెడు రెండవ వంతెన మీద ఫుట్పాతులు నిర్మించాలని సర్వీస్ రోడ్డు ని మసీదు కాంప్లెక్స్ వరకు పెంచి రోడ్డు ప్రమా దాలు జరగకుండా చూడాలని కోరా రు. ఈ కార్యక్రమంలో జాతీయ రహ దారుల అధికారులు యుగం ధర్, శైలజ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబిర్ పాషా స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సింగరేణి వారసులకు తీపి కబురు

**- డిపెండెంట్ల వయో పరిమితి 40 ఏళ్లకు పెంపు**
**- లబ్ధి పొందనున్న 300 మంది నిరుద్యోగులు**
**- 2018 మార్చి నుండి వర్తింపు**
**- సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ ఎండి ఎన్ బలరామ్**




*భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జూన్ 11, ప్రజాజ్యోతి*

సింగరేణిలో కారుణ్య ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయో పరిమితి 35 సంవత్సరాలు దాటి ఉద్యోగ అవకాశాన్ని కోల్పోతున్న వారికి యాజమాన్యం తీపి కబురు అందించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి కార్మికులకు ఇటీవల ఇచ్చిన హామీ మేరకు కారుణ్య నియామకాల్లో గరిష్ట వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసినట్లు సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ మంగళవారం ప్రకటనలో తెలి పారు. దాదాపు దశాబ్ద కాలంగా వయో పరిమితి నిబంధన వల్ల వందలాది మంది అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలను కోల్పోయారని, సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఇటీవల హైదరాబాద్ అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో బదిలీ వర్కర్లకు అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇస్తున్న సమయంలో రాష్ట్ర ముఖ్య మంత్రి , ఉప ముఖ్యమంత్రి సూచించారన్నారు. ఈ విషయంపై కూలంకశంగా చర్చించి సింగరేణి బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఒప్పించి సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2018 మార్చి 9వ తేదీ నుండి ఈ గరిష్ట వయోపరిమితి సడలింపు స్కీంను వర్తింపజేస్తున్నామని తెలియజేశారు. దీనివల్ల 2018 నుంచి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న దాదాపు 300 మందికి తక్షణమే ప్రయోజనం చేకూరనుందన్నారు. అలాగే రానున్న రోజుల్లోనూ మరింత మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. గరిష్ట వయో పరిమితి దాటిన వాళ్లు సింగరేణిలో ఉద్యోగం పొందడం కోసం దొంగ ధ్రువీకరణ పత్రాలతో తప్పుడు మార్గాలను ఆశ్రయించడం జరుగుతోందని.. దాని వల్ల విజిలెన్స్ కేసులను ఎదుర్కోవడంతోపాటు వారికి వచ్చే అన్ని బెనిఫిట్స్ను కోల్పోతున్నారని. వయో పరిమితి పెంపు వల్ల తప్పుడు మార్గాలను ఆశ్రయించబోరని పేర్కొన్నారు. పూర్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సింగరేణి సంస్థలో పనిచేస్తూ ఎవరైనా కార్మికుడు లేదా ఉద్యోగి మృతి చెందినట్లయితే ఆయన స్థానంలో అతని వారసుల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తుంటారు. అలాగే అనారోగ్య కారణాల రీత్యా ఉద్యోగానికి అనర్హులుగా మెడికల్ బోర్డు ప్రకటించిన కార్మికుల వారసులకు కూడా సింగరేణి సంస్థ బదిలీ వర్కర్ గా ఉద్యోగాల్లోకి తీసుకుంటుంది . అయితే ఈ రెండు విభాగాల్లోనూ వారసుల కనిష్ట వయసు 18 సంవత్సరాలుగాను గరిష్ట వయసు 35 సంవత్సరాలుగా పేర్కొనడం జరిగింది. కరోనా సమయంలో దాదాపు రెండేళ్లపాటు మెడికల్ బోర్డు నిర్వహించని కారణంగా కొంతమంది వారసులు గరిష్ట వయోపరిమితిని దాటిపోవడం జరిగింది. ఈ నేపథ్యంలో కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు డిపెడెంట్ ఉద్యోగాలకు గరిష్ట వయోపరిమితిని 35 ఏళ్ల నుండి 40 ఏళ్లకు పెంచాలని ఎంతోకాలంగా యాజమాన్యానికి మొరపెట్టుకున్నారు. కొంతమంది కార్మికులు మెడికల్ బోర్డులో అన్ ఫిట్ అయినప్పటికీ. వారి వారసుల వయసు 35 సంవత్సరాలు దాటడంతో ఉద్యోగం పొందే అవకాశం దక్కలేదు. ఈ పరిస్థితి కొన్ని కుటుంబాలలో చోటు చేసుకోవడంతో, ఆ కుటుంబాల వారసులకు ఉద్యోగం లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. కాగా ఇటీవల హైదరాబాదులో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు ఆధ్వర్యంలో 441 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. సభా కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ గరిష్ట వయోపరిమితి 40 ఏళ్లకు పెంచాలని, కార్మికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను తప్పనిసరిగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సింగరేణి యాజమాన్యంతో జరిగిన సమీక్షసమావేశాల్లో ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రి సంస్థ చైర్మన్ మరియు ఎండీ శ్రీ ఎన్. బలరామ్ ను ఆదేశించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సింగరేణి యాజమాన్యం గరిష్ట వయోపరిమితిని 40 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో దీనికి సంబంధించిన ఉత్తర్వులు సోమవారం సాయంత్రం విడుదల చేయడం జరిగింది.

**అర్హులకు వెంటనే ఉద్యోగాలు : సి అండ్ ఎండీ ఎన్. బలరామ్**



40 ఏళ్లకు సవరించబడిన ఉత్తర్వుల ప్రకారం అర్హులైన వారికి వెంటనే ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని సంస్థ చైర్మన్ ఎన్. బలరామ్ పేర్కొన్నారు. 2018 , మార్చి 9వ తేదీ నుండి ఈ స్కీం అమల్లోకి వస్తుందన్నారు. దీనికోసం సంబంధిత ఏరియాలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అయితే ఇప్పటికే ఉద్యోగానికి బదులు ఏక మొత్తం సొమ్ము తీసుకున్న వారికి కానీ, అర్హులైన వేరే వారసునికి ఉద్యోగం పొందినవారు కానీ ఈ కొత్త సవరణ ప్రకారం తిరిగి ఉద్యోగం పొందే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు పాత గరిష్ట వయోపరిమితి నిబంధన ప్రకారం ఉద్యోగం పొందలేని, ఎటువంటి సెటిల్మెంట్ జరగని కేసులకు మాత్రమే ఈ కొత్త స్కీం అమలవుతుందని పేర్కొన్నారు. కార్మికులు, కార్మిక సంఘాల హర్షం తాము ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న గరిష్ట వయోపరిమితి పెంపునకు రాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సింగరేణి యాజమాన్యం ద్వారా ఉత్తర్వులు జారీ చేయించినందుకు సింగరేణి కార్మికులు తమ హర్షం ప్రకటిస్తున్నారు. ప్రజా పాలనలో కూడా అనేకమంది ఈ విషయంపై దరఖాస్తు పెట్టుకున్నామని, తమ విజ్ఞప్తులను మన్నించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపు తున్నామన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు కూడా దీనిపై తమ హర్షం ప్రకటించారు.

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకంలో అవకతవకలు పై విచారణ ప్రారంభం



*భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జూన్ 11, ప్రజాజ్యోతి*

ప్రభుత్వ వైద్య కళాశాల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల మంజూరు అయిన (73) అవుట్సోర్సింగ్ నియామకాల లో అవుకతవుకలు జరిగాయని అందిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా ఉపాధి కల్పనా అధికారిని వేల్పుల విజేత మంగళవారం విచారణ ప్రారంభించారు. జిల్లా వైద్య కళాశాల ను సందర్శించి ఎన్ని పోస్టులు మంజూరయ్యాయి, ఎందరు నమోదు చేసుకున్నారు, ఎందరు అర్హత సాధించారు, ఎంతమంది ఉద్యోగాలు పొంది అక్కడ విధులు నిర్వహిస్తున్నారు అని తదితర వివరాల గురించి లక్ష్మణ రావు, ప్రిన్సిపల్, జిల్లా వైద్య కళాశాల, భద్రాద్రి కొత్తగూడెం వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. ఇట్టి విచారణను సత్వరమే పూర్తి చేసి పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్ అందజేస్తానని తెలియజేశారు. ఇట్టి పోస్టులు పూర్తిగా ప్రతిభ ఆధారంగానే నియామకం చేయాలని, ఎటువంటి పైకం అయినా తీసుకుని నియామకం చేశారని తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# బస్సుల సంఖ్య పెంచాలి

**- ప్రగతిశీల మహిళా సంఘం డిమాండ్**



*కొత్తగూడెం, జూన్ 11, ప్రజాజ్యోతి*

బస్సుల సంఖ్య పెంచి ప్రయాణికులకు ఇబ్బందులు కలగాకుండా చూడాలని ప్రగతిశీల మహిళాసంఘం డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐపీఎంయల్ లైన్ అనుబంధ సంఘం ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, ఎదలపల్లి సావిత్రి కేచ్చల కల్పన మాట్లాడుతూ కొత్తగూడెం, మణుగూరు , ఇల్లందు, డిపోల నుండి పెరుగుతున్న ప్రయాణికుల రీత్యా బసలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, ప్రభుత్వం6 గ్యారంటీలతో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. అన్ని డిపోలలో ప్రయాణికుల రద్దీ పెరిగిన రీత్యా బస్సుల సంఖ్య తగ్గింది కానీ పెరగలేదు అన్నారు. కొత్తగా ఇల్లందు డిపోలో బస్సులు లేవని కేవలం నామమాత్రానికే డిపో పరిమితమైందన్నారు . ఉన్న నాలుగు బస్సులు ఎక్కడ ఆగిపోతాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. అశ్వరావు పేట మండలంలోని, అనంతరం , కావడి గుండ్లకు బస్సులు రావడం లేదని వెంటనే బస్సులు కేటాయించాలనీ, ఇల్లందు మండలంలోని రొంపేడు, మిట్టపల్లి, ధర్మారం, ముత్తారపు కట్ట ఒంపు గూడెం మసివాగు కలుపు అటునుండి కొమరారం బస్సులు నడపాలనీ, సుదిమల్ల, హనుమంతులపాడు ధర్మారం, టేకులపల్లి మండలంలో మార్కుల ఏజెన్సీ ఎన్ని ప్రాంతాలకు బస్సుల సంఖ్య పెంచి ఈ రూట్లో బస్సులు నడపాలని కోరారు, ఖమ్మం కూడా పరిస్థితి అలాగనే ఉందని బస్సుల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు . ఈ కార్యాక్రమం లో కొమరారం మాజీ సర్పంచ్ ముత్తక్క, ఇల్లందు మాజీ కౌన్సిలర్ రేసు సరిత వెంకటమ్మ , సరోజినీ ,భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు .